క్లుప్తంగా

వెంకన్న సన్నిధిలో ఎమ్మెల్యే ధర్మశ్రీ దంపతులు



ఎమ్మెల్యే దంపతులకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం స్వామి వారి అష్టోత్తర పూజల్లో చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివార్ని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు స్వామి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహావాచనం తదితర పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు.

బాధితుడికి సాయం



అనారోగ్య బాధితుడికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: లివర్‌కు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శుక్రవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన అరెసం రమణ కుమార్ కేబుల్ నెట్‌వర్క్‌లో ఆపరేటర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాది నుంచి లివర్‌కి సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు అతడి వైద్యానికి చాలా ఖర్చుపెట్టారు. ఇంట్లో ఎవరూ సంపాదించేవారు లేక అనారోగ్యం కారణంగా ఆయన పనికి వెళ్ల లేక చాలా ఇబ్బంది పడుతున్నాడు. దీంతో కుటుంబం గడవలేని పరిస్థితిలో స్థానిక కాశీఅన్నపూర్ణదేవి సేవా సంస్థ సభ్యులను సహాయం కోరారు. దీంతో రమణ కుమార్ ఇంటికి వెళ్లి కాశీ అన్నపూర్ణ సేవా సంస్థ సభ్యులు రూ.10 వేలు ఆర్థికసాయంగా అందజేశారు.

మలికిపురం ఎస్సైగా సంపత్‌కుమార్



ఎస్సై సంపత్‌కుమార్‌ను అభినందిస్తున్న స్టేషన్ సిబ్బంది

మలికిపురం: స్థానిక ఎస్సైగా బి.సంపత్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సంపత్‌కుమార్ అమలాపురం నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ పని చేసిన ఎస్సై జి.సురేంద్ర అమలాపురం బదిలీపై వెళ్లారు. నూతన ఎస్సై సంపత్‌కుమార్‌ను స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛంతో అభినందించారు. ఈ సందర్భంగా ఎస్సై సంపత్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పని చేస్తానన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని అన్నారు. ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారిస్తామన్నారు.

అయినవిల్లి ఎస్సైగా సురేష్‌బాబు



అయినవిల్లి: స్థానిక ఎస్సైగా కె.సురేష్ బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయన అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఇప్పటివరకూ అయినవిల్లి ఎస్సైగా పనిచేసిన ఎస్.నాగేశ్వరరావు బదిలీపై కాట్రేనికోన వెళ్లారు.

కొబ్బరితో స్వీట్ల తయారీపై మహిళలకు శిక్షణ



కొబ్బరితో స్వీట్ల తయారీపై శిక్షణ ఇస్తున్న గోపాలకృష్ణ

మామిడికుదురు: నాబార్డు సహకారంలో ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈదరాడలో లైవ్లీ ఉడ్ అండర్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎల్‌ఈడీపీ)లో భాగంగా మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. కొబ్బరి పీచు బొమ్మల తయారీపై కూడా ఇక్కడ మహిళలు శిక్షణ పొందుతున్నారు. రెండో విడతలో భాగంగా జరుగుతున్న ఈ శిక్షణా కేంద్రంలో అమలాపురానికి చెందిన ఆదర్శ రైతు అడ్డాల గోపాలకృష్ణ కొబ్బరి కోరుతో స్వీట్ల తయారీపై మహిళలకు శిక్షణ ఇచ్చారు. కొబ్బరి కోరుతో స్వీట్లు తయారు చేసే విధానాన్ని గోపాలకృష్ణ ప్రయోగాత్మకంగా వివరించారు. గోపాలకృష్ణ మాట్లాడుతూ మహిళలు కొబ్బరి ఉత్పత్తులపై అవగాహన కల్పించుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. ఆక్సిజన్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కటికిరెడ్డి గంగాధరమ్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

‘సురక్ష’తో అందరికీ ఆరోగ్యం

- ఎమ్మెల్యే జగ్గిరెడ్డి
- జోరుగా వైద్య శిబిరాలు



నర్శిపూడి జగనన్న సురక్ష శిబిరంలో ప్రసంగిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి



ఇరుసుమండలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

ఆలమూరు: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో సీఎం జగన్ ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం చేకూరుతుందని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని నర్శిపూడిలో శుక్రవారం వైఎస్సార్ సీపీ సీనియర్ నేత చల్లా వెంకట సుబ్రహ్మణ్యం, సర్పంచ్ కందిబొట్ల శ్రీనివాసు, ఎంపీటీసీ మేడిశెట్టి సుబ్బారావు, గ్రామ కార్యదర్శి ఆర్‌వీవీ సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ చల్లా పద్మ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లాలో వైద్య నిపుణులు పాల్గొని 476 మందికి మెరుగైన వైద్య సేవలు అందించారు. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న పలువురిని గుర్తించి వైఎస్సార్ ఆరోగ్య సురక్ష ద్వారా రాజమహేంద్రవరం, అమలాపురం ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి శిబిరాన్ని సందర్శించి రోగులకు అందుతున్న సేవలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు టేకి రాంబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు కడలి వెంకటరమణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఆర్.బాలామణి, హెల్త్ ఎడ్యుకేటర్ బి.సూర్యనారాయణ, పేరూరి వీరబాబు, పురపాకల సత్యనారాయణ, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: వైద్యం ఖరీదుగా మారిన ప్రస్తుత తరుణంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరికీ ఆరోగ్య భాగ్యాన్ని కల్పించాలనే సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు వైద్యాన్ని చేరువ చేశారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఇరుసుమండలో తహసీల్దార్ టి.మంగతాయారు పర్యవేక్షణలో ఎంపీటీసీ బుడితి సత్యనారాయణమ్మ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సైతం వైద్య శిబిరం ఏర్పాటు చేసి స్పెషలిస్టు వైద్యులతో పరీక్షలు చేయిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, సొసైటీ అధ్యక్షులు నాగాబత్తుల సత్యానందం, అక్కిశెట్టి పెద్ద, దొమ్మేటి రాధాసూర్యనారాయణ, గుబ్బల నాగమహేష్ తదితరులు పాల్గొన్నారు.

గంటిలో..

కొత్తపేట: మండలంలోని గంటి గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని అముడా చైర్మన్ డేవిడ్‌రాజు ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ సాగి బంగార్రాజు అధ్యక్షతన జరిగిన సభలో చైర్మన్ డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ఏ విధమైన అనారోగ్య సమస్యలు ఉన్నా ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకుని వైద్యం పొందడం ద్వారా సంపూర్ణ ఆరోగ్య జీవనం గడపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. పీహెచ్‌సీ వైద్యులతో పాటు స్పెషలిస్టులు, సిబ్బంది శిబిరానికి వచ్చిన ప్రజలకు వివిధ పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ మట్టపర్తి వెంకట్రావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు భూపతిరాజు సత్యనారాయణరాజు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు యడ్ల కృష్ణమూర్తి, పార్టీ యువజన విభాగం సభ్యుడు నేరేడుమిల్లి నరేష్, పలువురు పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: గ్రామ సచివాలయం-4 పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసి వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. సర్పంచ్ రేవు జ్యోతి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎంపీటీసీ కొపనాతి పుష్పలత, వైఎస్సార్‌సీపీ నాయకులు బండారు కాశీ, మట్టా ఏడుకొండలు, గొల్ల చిన్ని, కొప్పాడి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ముంగండ-2లో..

పి.గన్నవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని ముంగండ-2 గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రారంభించారు. వైద్యాధికారులు కె.సుబ్బరాజు, రియాజ్ ఉన్నీషాబేగం, మణిదీపిక, సిద్ధార్థ నాయుడుల ఆధ్వర్యంలో 340 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ కుసుమ చంద్రకళ, నాయకులు కుసుమ వెంకటేశ్వరరావు, దొమ్మేటి దుర్గారావు, బీవీవీఎఎస్ఎన్ మూర్తి, స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదుర్రులో..

మామిడికుదురు: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. ఆదుర్రు జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద శుక్రవారం జరిగిన సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. అక్కడ ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. కంటి పరీక్షలు నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలించారు. ప్రతి ఒక్కరికి నాణ్యమైన ఉచిత వైద్యం అందించాలన్న లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ గెడ్డం మహలక్ష్మమ్మ, జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, కుసుమ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏం ఉద్ధరించారని పొత్తులతో వస్తారు?

టీడీపీ-జనసేనలకు ఎమ్మెల్యే రాపాక ప్రశ్న



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: ప్రజలను ఏం ఉద్ధరించారని పొత్తులతో ఎన్నికలకు వస్తారని టీడీపీ-జనసేనలను ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు ప్రశ్నించారు. శుక్రవారం మండలంలోని కత్తిమండలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గ వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. వచ్చే నెల 9వ తేదీ నుంచి జరిగే వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహణపై ఈ సభ నిర్వహించారు. ఎమ్మెల్యే రాపాక పాల్గొని మాట్లాడుతూ ప్రజలను మరోసారి మోసం చేయడానికే తెలుగుదేశం, జనసేన పార్టీలు పొత్తులతో వస్తున్నాయన్నారు. గతంలో ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడని పొత్తు ఇప్పుడు ఎలా ఉపయోగపడుతుందని ప్రశ్నించారు. తాను చేసింది ప్రజలకు చెప్పి ఓటు వేయమని అడుగుతున్న దమ్మున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే అన్నారు. ఈ రోజు రాష్ట్రంలో ప్రజా సంక్షేమం వెల్లివిరుస్తుందన్నారు. అనేక ఉద్యోగాలు సృష్టించి నిరుద్యోగులకు ఉపాధి చూపిన ఘనత జగన్‌దని అన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల వీరబ్రహ్మాజీ, పార్టీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్య కుమార్, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, జెడ్పీటీసీలు మట్టా శైలజ, దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీ రుద్రరాజు చిన్నరాజా, ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకర బాబ్జి, కేఎస్ఎన్ రాజు, కంచర్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



కొత్తపేట మసీదులో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, ముస్లింలు

కొత్తపేట: మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక ముస్లిం పెద్దల ఆధ్వర్యంలో గ్యార్మీ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక కమ్మిరెడ్డిపాలెం మసీదులో గ్యార్మీ షరీఫ్‌ను స్తుతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గురువారం రాత్రి మండల ముస్లిం సంఘ నాయకుడు షేక్ గౌస్ ఆధ్వర్యంలో మసీదు, షాదీఖానా కమిటీ ప్రెసిడెంట్ షేక్ కాజాబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ ముఖ్యఅతిథులుగా పాల్గొని వారితో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పాలన సాగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న రోజుల్లో అందరూ సంపూర్ణ మద్దతునిచ్చి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ బడేమియా, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, ముస్లిం సంఘ నాయకులు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్య చర్యలు

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీశంకర్ కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరిచేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది పై డేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

ఢిల్లీకి ‘మన భూమి మట్టి కలశం’



కొత్తపేట నుంచి మట్టి కలశంతో పయనమవుతున్న జేపీ

కొత్తపేట: ‘మన భూమి-మన దేశం’ పేరుతో గ్రామాల్లో కలశాల్లో సేకరించిన మట్టితో రాష్ట్ర బీజేపీ యువమోర్చ అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాష్‌నారాయణ (జేపీ) శుక్రవారం ఢిల్లీకి పయనమయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ‘ఆజాదీకా అమృత్ మహోత్సవం’లో భాగంగా అమర వీరులను స్మరిస్తూ ‘మన భూమి-మన దేశం’ ‘నేల తల్లికి నమస్కారం’ ‘అమర వీరులకు వందనం’ పేరుతో ఢిల్లీలో ఏర్పాటు చేస్తున్న స్మృతి వనానికి రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కొత్తపేట మండలంలో 10 గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి మట్టిని సేకరించారు. ఆ మట్టి కలశాన్ని ఢిల్లీలో పార్లమెంట్‌కు తీసుకువెళ్లే బాధ్యతను పార్టీ నాయకులు రాష్ట్ర యువమోర్చా అధికార ప్రతినిధి జేపీకి అప్పగించారు. ఆ మేరకు పూజలు చేసిన మట్టి కలశాన్ని జిల్లా, మండల నాయకులు చేతుల మీదుగా జేపీకి సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, ఆర్ఎస్ఎస్ కోనసీమ ప్రముఖ్ తొగరు సీతారామాంజనేయులు, మండల బీజేపీ అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ విగ్రహం ఊరేగింపు

మామిడికుదురు: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా అప్పనపల్లిలో శెట్టిబలిజ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ విగ్రహాన్ని శుక్రవారం ఘనంగా ఊరేగించారు. గరగ నృత్యాలు, మేళతాళాలు, డీజే నృత్యాలు, భక్తుల కోలాహలం నడుమ ఈ ఊరేగింపు ఆద్యంతం ఘనంగా జరిగింది. గ్రామంలో ఊరేగింపు అనంతరం అమ్మవారి విగ్రహాన్ని స్థానిక వైనతేయ గోదావరి నదిలో నిమజ్జనం చేశారు.

భారీ అన్న సమారాధన

పి.గన్నవరం: స్థానిక ఏజీ రోడ్డులో వేంచేసిన లక్ష్మీ కనకదుర్గమ్మ వారి ఆలయం వద్ద దసరా మహోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు. ఈసందర్భంగా అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నాయకుడు అడ్డగళ్ల నారాయణమూర్తి తదితరులు ఆధ్వర్యం వహించారు.

ఆయుష్మాన్ భారత్‌ను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో ఆయుష్మాన్ భారత్ సేవలు ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు ప్రసవాల సంఖ్యను పెంచాలని వైద్యాధికారి పి.భవానీశంకర్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం వైద్యారోగ్య సిబ్బందికి సెక్టార్ సమావేశం జరిగింది. జనవరి నెలలో సాధించిన ప్రగతిని అధికారులకు ఆరోగ్య సిబ్బంది వివరించారు.

ఎంపీని కలసిన పాలకవర్గ సభ్యులు



మోపిదేవిని కలసిన మంగాదేవి, బాలసుబ్రహ్మణ్యం

అయినవిల్లి: నర్సాపురం పర్యటనకు విచ్చేసిన రాజ్యసభ ఎంపీ మోపిదేవి వెంకటరమణరావును శుక్రవారం అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి పాలక మండలి సభ్యురాలు కర్రి మంగాదేవి, కోనసీమ అగ్నికుల క్షత్రియ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్రి బాల సుబ్రహ్మణ్యంలు మర్యాద పూర్వకంగా కలసి అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి చిత్రపటం అందజేశారు. వీరితో పాటు రాష్ట్ర అభ్యుదయ అగ్నికుల క్షత్రియ మహా సంఘం ఉపాధ్యక్షుడు, జిల్లా గోపీనాథ్ వర్మ, కోనసీమ అగ్నికుల క్షత్రియ గౌరవాధ్యక్షుడు కర్రి స్వామినాథ్, అయినవిల్లి మండల అధ్యక్షులు శేరు దుర్గాప్రసాద్, పొన్నాల రాజు, సంగాని వీర్రాజు తదితరులు ఉన్నారు.

అర్జీదారుల పట్ల విశ్వసనీయత కలిగి ఉండాలి

- ఆత్రేయపురం మహారాజా ప్యాలెస్‌లో ‘జగనన్నకు చెబుదాం’
- 67 అర్జీల స్వీకరణ
- జిల్లా జేసీ నూపుర్ అజయ్



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా జేసీ నూపుర్ అజయ్

ఆత్రేయపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన, జగనన్నకు చెబుదాం వంటి కార్యక్రమాల నిర్వహణ తీరుపై అర్జీదారులతో విశ్వసనీయత పెంపొందించే దిశగా పరిష్కార మార్గాలు క్రియాత్మకంగా చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) ఎస్.నూపుర్ అజయ్ జిల్లా స్థాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆత్రేయపురం మహారాజా ప్యాలెస్ కల్యాణ మండపంలో మండల స్థాయి స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలు జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో నిర్వహించారు. తొలుతగా జిల్లా జేసీ ఎస్.నూపుర్ అజయ్, ఎంపీడీఓ నాతి బుజ్జి సుమారుగా 67 అర్జీలను అర్జీదారుల నుంచి స్వీకరించారు. వీటిలో ప్రధానంగా సామాజిక భద్రత పింఛన్ల మంజూరు, పౌర సరఫరాలు, వైద్య సహాయం, రీ సర్వే, భూ సమస్యలు, తాగు, సాగునీటి సమస్యలు వివిధ సంక్షేమ పథకాల లబ్ధికి సంబంధించిన సమస్యలు ధ్రువపత్రాల జారీ ఇతర సమస్యలపై అందాయి. అలాగే గ్రామ పంచాయతీలకు సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు, స్టాంప్ డ్యూటీ రావడం లేదని అర్జీ అందజేశారు. కట్టుంగలో వేంచేసియున్న ఆంజనేయ స్వామి భూములు అన్యాక్రాంతమైనట్లు అర్జీ అందించారు. ఈ సందర్భంగా జిల్లా జేసీ నూపుర్ అజయ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్పందనలో వచ్చిన అర్జీలను నిర్ణిత కాలవ్యవధిలో, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు లోబడి పరిష్కరించే విధంగా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ, పర్యవేక్షణ వ్యవస్థలను బలోపేతం చేయాలన్నారు. స్పందనలో వచ్చిన అర్జీలను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కార మార్గాలు చూపాలని, నిర్దేశిత గడువులోగా పరిష్కార మార్గాలు చూపకపోయిన పక్షంలో సంబంధిత అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అర్జీదారుడికి చూపే పరిష్కారంపై అత్యంత శ్రద్ధ వహించి పూర్తిగా చదవి తదుపరి వాటికి పరిష్కార మార్గాలు చూపాలన్నారు. జగనన్నకు చెబుదాం వెబ్‌సైట్ ద్వారా 1902 నంబర్‌కు ప్రజల సమస్యలను తెలియజేయాలన్నారు. ఎప్పటికప్పుడు లాగిన్ ఓపెన్ చేసి పరిష్కరించాలన్నారు. పలువురు అర్జీదారులు మర్యాద పూర్వకంగా స్వాగతిస్తూ వారి సమస్యలను సావధానంగా విని పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఒకసారి సమర్పించిన అర్జీ మరలా అదే అంశంపై పునరావృతం కాకుండా గడువు దాటిన అర్జీలు లేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం ఆర్డీవో ఎస్.సుధాసాగర్, డీపీఓ వి.కృష్ణకుమారి, సాంఘిక సంక్షేమ శాఖ సాధికారత అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకుడు డాక్టర్ వి.శివశంకర్ ప్రసాద్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఏ.బోసుబాబు, జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి పద్మశ్రీరాణి, జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ సహాయ సంచాలకులు కె.విశాలక్షి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు కె.ప్రభాకర్‌రావు, ఐపీఓ మాధురి, వివిధ శాఖలకు చెందిన జిల్లా , డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అండర్-17 క్రికెట్ జట్టుకు వీరవల్లిపాలెం విద్యార్థి ఎంపిక



ముద్దన సురేంద్ర

అయినవిల్లి: ఎస్‌జీఎఫ్ అండర్-17 క్రికెట్ జట్టుకు మండలంలోని వీరవల్లిపాలెం పదో తరగతి విద్యార్థి ముద్దన సురేంద్ర ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సురేంద్రను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కె.మెహర్‌వాసు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అయినవిల్లి: మండల పరిషత్ కార్యాలయం వద్ద స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చేతుల మీదుగా శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. నల్లచెరువుకు చెందిన చప్పిడి భాగ్యలక్ష్మికి రూ.26 వేలు, వీరవల్లిపాలెంకు చెందిన కొరపు రాధకు రూ.30 వేలు, నేదునూరుకు చెందిన కుంచే హైమావతికి రూ.22 వేలు, వీరవల్లిపాలెంకు చెందిన శ్రీరెడ్డి ఈశ్వర పరసరాముడుకు రూ.లక్ష, వెలువలపల్లికి చెందిన అందే వీరభద్రుడుకు రూ.16 వేలు, వెలువలపల్లికి చెందిన చల్లా వెంకటలక్ష్మికి రూ.12 వేలు మొత్తం రూ.2 లక్షల ఆరు వేలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, నేదునూరు సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, బొంతు రాజేంద్ర, బొంతు శ్రీను, మట్టపర్తి వెంకటరమణ, మట్టపర్తి రామారావు, మిండగుదిగి రాంబాబు, శ్రీరెడ్డి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

గౌతమి పాత బ్రిడ్జిపై కారు బోల్తా

రావులపాలెం: 16 నంబర్ జాతీయ రహదారిపై స్థానిక గౌతమి గోదావరి పాత బ్రిడ్జిపై శుక్రవారం ఒక మారుతి కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనకు సంబంధించి పోలీస్, హైవే పెట్రోలింగ్ సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమవరానికి చెందిన పురిల్ల బాలు కార్ తీసుకుని రాజమహేంద్రవరంలో ఉన్న తన యజమానిని ఆసుపత్రి నుంచి ఎక్కించుకుని వచ్చేందుకు బయలుదేరాడు. మార్గంమధ్యలో రావులపాలెం పాత బ్రిడ్జి పైకి వచ్చే సరికి ఒక వాహనాన్ని ఓవర్టేక్ చేస్తూ అదుపుతప్పి డివైడర్‌ని ఢీ కొట్టి కారు బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న డ్రైవర్ బాలుకు స్వల్ప గాయాలు కాగా హైవే పెట్రోలింగ్ సిబ్బంది సంఘటన చేరుకుని క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం క్రేన్ సాయంతో కారును తొలగించారు. సంఘటన ప్రాంతాన్ని రావులపాలెం ఎస్సై వెంకటరమణ పరిశీలించి వివరాల నమోదు చేసుకున్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

మామిడికుదురు: బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయని, వాటిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.విజయలత సూచించారు. లూటుకుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం బాల్య వివాహాలతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పోక్సో చట్టం అంశాలపై చర్చించారు.

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

అంబాజీపేట: అదృశ్యమైన యువతి శవమై తేలిన సంఘటనలో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అంబాజీపేట ఎస్సై ఎ.చైతన్యకుమార్ శుక్రవారం తెలిపారు. మండలంలోని పుల్లేటికుర్రుకు చెందిన చీకురిమిల్లి సిరి (19) ఈ నెల 24న అదృశ్యమైన విషయం తెలిసిందే. ఆ యువతి గురువారం తొండవరం వైనతేయ గోదావరి నదిలో శవమై తేలడంతో పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా శవపంచనామా సందర్భంగా యువతి తల్లిదండ్రులు పోలీసులకు తెలిపిన మరిన్ని వివరాల ప్రకారం లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గాయపడిన పూజారి మృతి

పి.గన్నవరం: యర్రంశెట్టివారిపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పూజారి మానేపల్లి వెంకట లక్ష్మీ నర్సింహాశర్మ (57) రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా తాటికాయలవారిపాలెం అమ్మవారి ఆలయంలో అర్చకుడిగా పని చేస్తున్నారు. గురువారం ఆయన బైక్‌పై రావులపాలెం వైపు వెళ్తుండగా యర్రంశెట్టివారిపాలెం వద్ద వెనుక నుంచి కారు ఢీకొట్టిన విషయం విదితమే. తలకు తీవ్ర గాయాలపాలైన శర్మను రాజమహేంద్రవరంలోని ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతదేహానికి కొత్తపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై హరికోటి శాస్త్రి వివరించారు.

రోడ్డు ప్రమాదంలో బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ మృతి



ఈద ఎజ్రా శాస్త్రి (ఫైల్)

రాజోలు: రోడ్డు ప్రమాదంలో రాజోలు ప్రభుత్వాస్పత్రి బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ ఈద ఎజ్రా శాస్త్రి (30) మృతి చెందాడు. రాజోలు పోలీసులు తెలిపిన కథకం ప్రకారం.. మలికిపురం మండలం రామరాజులంకకు చెందిన ఎజ్రాశాస్త్రి గురువారం రాత్రి రామరాజులంక నుంచి రాజోలులో అద్దెకు ఉంటున్న ఇంటికి బైక్‌పై వస్తున్నాడు. రాజోలు లూథరన్ చర్చి వద్దకు చేరుకునే సరికి బైక్ అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న బండరాయిని బలంగా ఢీ కొట్టి పక్కనే ఉన్న డ్రైన్ గుంతలో పడిపోయాడు. తెల్లవారే వరకు ఈ సంఘటన ఎవరూ గుర్తించకపోవడంతో మురుగు డ్రైన్‌లో ఎజ్రాశాస్త్రి చిక్కుకుపోయి మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని డ్రైన్ నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఆస్పత్రికి వచ్చి ఎజ్రాశాస్త్రి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ అప్పారి సూర్యనారాయణ, సిబ్బంది నివాళులర్పించారు.